క్లుప్తంగా

అయ్యప్ప సన్నిధిలో ముగిసిన నిత్యాన్నదానం



స్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా వద్ద ధర్మశాస్త దేవాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ముగింపు కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, ఆరాధనలు, అలంకరణలు చేశారు. అనంతరం పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కె.మన్నయ్యపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కె.మన్నయ్యపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.భరతలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ శిబిరాలు దోహదపడతాయని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి త్రినాథస్వామి, డాక్టర్ చిన్నంనాయుడు, అసోసియేట్ ప్రొఫెసర్ వి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీతారామస్వామికి ఆత్మీయ పురస్కారం



సీతారామస్వామికి సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ పండితులు, రిటైర్డ్ హెడ్మాస్టర్, బూరవెల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అర్చకులు ఆరవెల్లి సీతారామస్వామికి ఆరామ ద్రావిడ సంఘం ఆత్మీయ పురస్కారం లభించింది. విజయనగరం జిల్లా రామనారాయణంలో జరిగిన ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ఆరామ ద్రావిడ సంఘం ఆత్మీయ కలయిక సభలో ఈ సత్కారం జరిగింది. పార్వతీపురం సూర్యపీఠం నిర్వాహకులు వేమకోటి నరహరి శాస్త్రి అభినందనలు తెలిపారు.

జయలక్ష్మి మృతికి ధర్మాన సంతాపం



శిమ్మ జయలక్ష్మి (ఫైల్)

శ్రీకాకుళం: శ్రీకాకుళం చిత్తరంజన్‌వీధిలో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది శిమ్మ రాజశేఖర్ మాతృమూర్తి శిమ్మ జయలక్ష్మి(83) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు రాజశేఖర్ నివాసానికి వెళ్లి సంతాపం తెలియజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

మండల బడ్జెట్‌కు ఆమోదం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ ఆమోద సమావేశం నిర్వహించారు. సభకు చాలా మంది సభ్యులు గైర్హాజరయ్యారు. కోరం కోసం నిరీక్షించి ఎంపీటీసీ సభ్యులు ఎనిమిది మంది రావటంతో సంతకాలు తీసుకొని సమావేశం పూర్తి చేశారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సవరణ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1.21 కోట్లు ఆదాయం, రూ.1.9 కోట్లు ఖర్చు చూపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.23 కోట్లు ఆదాయం, రూ.1.23కోట్లు ఖర్చుకు ప్రతిపాదనలు చేశారు. సమావేశంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎంపీడీవో సీపాన హరిహరరావు, పరిపాలనాధికారి పీవీఎస్ రామ్మోహన్, సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం



అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో సత్యసాయి పెద్దమందిరంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఉచిత శిక్షణ కోర్సు, మగ్గం వర్కుల శిక్షణలను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో 75 రోజుల కోర్సులు పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కమలా త్రివేణి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి నరసింహమూర్తి, నాగేశ్వరరావు, శివనారాయణ, కె.వి.ఇ.పట్నాయక్, సాయికుమార్, కన్వీనర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో.. బాదుడే బాదుడు

● విద్యుత్ చార్జీల పెంపును వెనక్కితీసుకోవాలి ● వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్ ● శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు



శ్రీకాకుళం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నిరసన చేపట్టారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గ కేంద్రాల్లో శుక్రవారం ర్యాలీలు చేపట్టి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చార్జీల భారం తగ్గించాలని కోరుతూ విద్యుత్ కేంద్రాల వద్దకు వెళ్లి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

ప్రజల పక్షాన పోరాడతాం



శ్రీకాకుళం విద్యుత్‌శాఖ ఎస్ఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు తిరగకముందే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు షాకిచ్చారని వైఎస్సార్‌సీపీ కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మ్యానిఫెస్టోను మతగ్రంథంలా భావించి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో బాదుడే బాదుడు పాలన మొదలైందని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ పార్టీ నాయకులు నగరంలోని సూర్యమహల్ కూడలి నుంచి విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చార్జీలు తగ్గించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఎస్ఈ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారం చేజిక్కించుకోవడానికి అనేక హామీలిచ్చి ఒక్కటి కూడా అమలుచేయకుండా ప్రజలకు మోసగిస్తోందని దుయ్యబట్టారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా మోసం, దగా తప్ప నిజాయితీగా పాలించడం చేతకాదన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేయకతప్పదని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, ఎంపీపీ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ఇప్పుడు చార్జీలు పెంచి ప్రజలను, స్మార్ట్‌మీటర్లు పెట్టి రైతులను నట్టేట ముంచేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల పురుషోత్తం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్సీ,ఎస్టీలకు ఉచితంగా విద్యుత్ ఇస్తే కూటమి ప్రభుత్వం వారందరికి బకాయి పేరిట విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎంఏ బేగ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, సాధు వైకుంఠరావు, నాయకులు ఎం.వి.స్వరూప్, పొన్నాడ రుషి, ఎన్ని ధనంజయరావు, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, నక్క రామరాజు, టి.కామేశ్వరి, గుంట జ్యోతి, సీపాన రామారావు, రుప్ప శేషగిరి, కనపల తేజ, తారక్, రూరల్ మండలం నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, వై.వి.శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, యజ్జల గురుమూర్తి, బగ్గు అప్పారావు, బాన్న నర్సింగరావు, అల్లు లక్ష్మీనారాయణ, మూకళ్ల తాతబాబు, గార మండల నాయకులు ఎంపీపీ గొండు రఘురాం, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పీస శ్రీహరి, పీస గోపి, రణస్థలం మండల నాయకుడు పిన్నింటి సాయి తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం మండల కేంద్రంలో రామతీర్థాలు కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పార్టీ శ్రేణులు

నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



రణస్థలంలో ర్యాలీలో పాల్గొన్న గొర్లె కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

రణస్థలం: సామాన్య ప్రజల నెత్తిన రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం వెంటనే బాదుడు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి నుంచి రణస్థలం విద్యుత్ శాఖ కార్యాలయం వరకు రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, బాధిత విద్యుత్ వినియోగదారులతో కలిసి శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ చంద్రబాబు బాదుడు పాలనలో పెంచిన ట్రూ-అప్ కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు. కరెంట్ చార్జీలకు సంబంధించి ఇప్పటికే రూ.6వేల కోట్ల బాదుడు మొదలై.. మరో రూ. 9,412.50 కోట్లు వచ్చే జనవరి నుంచి వినియోగదారులపై మోపేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. అక్టోబర్, నవంబర్ నెలల మధ్య రూ.200 అంటే 35శాతం అధికంగా బిల్లు రావడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నా బిల్లు కట్టాలని నోటీసులు ఇస్తున్నారని, లేదంట్ కనెక్షన్లు కట్ చేసి దళితుల ఇళ్లలో చీకట్లు నింపుతున్నారని మండిపడ్డారు. అనంతరం రణస్థలం విద్యుత్ శాఖ ఏఈ జి.తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, లంకలపల్లి ప్రసాద్, గొర్లె అప్పలనాయుడు, సనపల నారాయణరావు, బల్లాడ జనార్దనరెడ్డి, జరుగుళ్ల శంకర్, నేతింటి నీలమప్పడు, కాయల రమణ, మీసాల సీతంనాయుడు, దన్నాన రాజీనాయుడు, లుకలాపు శ్రీనివాసరావు, బొంతు సూర్యనారాయణ, జగ్గురోతు తవిటినాయుడు, మీసాల శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, ముద్దాడ శంకర్, బొగ్గు రాజారావు, శ్రీరాములు, రెడ్డి విశ్వేశ్వరరావు, దేశెట్టి తిరుపతిరావు, గొర్లె అప్పలనర్సునాయుడు, నక్కా కృష్ణమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీకాకుళంలో విద్యుత్‌శాఖ కార్యాలయం గేటు వద్ద నినదిస్తున్న పార్టీ శ్రేణులు

నెరవేరని లక్ష్యం



నిరుపయోగంగా బందరువానిపేట మరుగుదొడ్లు



కొర్ని చెరువు గట్టుపై నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు

● నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు
● రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడమే కారణం

గార: వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు వాడుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నాయి. అయితే వాటి నిర్వహణ గాలికొదిలేయడంతో బహిరంగ మలవిసర్జన నిర్మూలించలన్న లక్ష్యం నీరుగారుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కోసం ఆర్‌డబ్ల్యూస్ అధికారులు ఆదరాబాదరాగా నిర్మాణాలు చేపట్టారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన పంచాయతీరాజ్ సిబ్బంది దృష్టి సారించకపోవడంతో లక్షలాది రూపాయల నిధులు వృథా అవుతున్నాయి. గత టీడీపీ హయాంలో గార మండలంలో బందరువానిపేట, కొర్ని, శాలిహుండం పంచాయతీ కొత్తపేట వద్ద సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. తీరప్రాంత గ్రామమైన బందరువానిపేటలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్థల సమస్య ఉంది. అందుకోసం మత్స్యకార సామాజిక భవనం ప్రాంగణంలో 30 సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అవి వాడుకునేందుకు రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించకపోవడంతో వినియోగంలోకి రాలేదు. వీటి తలుపులు కూడా తుప్పు పట్టి పాడయ్యాయి. గది గోడలు పెచ్చులూడుతున్నాయి. ప్రస్తుతం మరుగుదొడ్లు విషసర్పాలు, కుక్కలకు నిలయాలుగా మారాయి. కొర్ని పంచాయతీలో కొర్లాంకు వెళ్లే బీటీ రోడ్డు పక్కన లక్షలాది రూపాయలతో చెరువు గట్టుపై సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అవి కూడా తుప్పలతో నిండిపోయాయి. కొత్తపేట చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన గదుల్లో కొన్నింటిని స్థానిక అవసరాలకు వాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

కమ్యూనిటీ మరుగుదొడ్లు వాడుకలోకి తీసుకువచ్చేలా సంబంధిత సెక్రటరీలకు ఆదేశాలిస్తాం. రన్నింగ్ వాటర్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి. మరుగుదొడ్లను బాగు చేయడంతో పాటు రోజూ క్లీనింగ్, బ్లీచింగ్ కోసం వ్యక్తిని నియమించేలా చర్యలు చేపడతాం.

– కూర్మారావు, ఈవోపీఆర్‌డీ, గార

సంక్షిప్తంగా..

క్యాలెండర్ ఆవిష్కరణ



శ్రీకాకుళం అర్బన్: ఏ.పి.పి.టి.డి ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎ.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్, జిల్లా ట్రెజరర్ ఆర్.నవీన్‌కుమార్, గౌరీ, శ్రీను, ప్రసాద్, అనిల్, ధనుంజయరావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాల సేకరణ ధరలు పెంచాలి



గార: విశాఖ డెయిరీ పాల సేకరణ ధరలను వెంటనే సవరించాలని కోరుతూ శుక్రవారం సతివాడ డెయిరీ ఉప కేంద్రం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పశువులకు ఉపయోగిస్తున్న అన్ని సరుకుల ధరలు పెరుగుతున్న తరుణంలో సేకరణ ధరలు తగ్గించడం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సంఘాల ప్రతినిధులు పొందూరు చంద్రరావు, వెలమల రమణ అన్నారు. రైతుల శ్రమకు తగ్గట్టుగా ధరలు ఉండాలని, పశుదాణాకు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లద్దు కృష్ణమూర్తి, గోరు కొర్లయ్య, చల్ల రమణ, యాళ్ల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్ ప్రజావేదిక సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో శనివారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో శోభాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన 2618 పనులపై 20 రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాయని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకానున్నారని చెప్పారు.

రాష్ట్ర జట్లకు అభినందన



శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ జట్లను ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కూన రవికుమార్ అభినందించారు. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు రన్నరప్‌గా, బాలురు జట్టు తృతీయస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి చేరుకున్న ఏపీ జట్లను శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టుకు ముగ్గురు క్రీడాకారులు మెట్ట హర్షవర్ధన్, పూజారి కళ్యాణ్‌రామ్, చింతాడ జశ్వంత్ ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకాలు సాధించారు.

29న మహాసంకల్ప దినోత్సవం



శ్రీకాకుళం అర్బన్: మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ఆరోగ్యకర సమాజం కోసం శ్రీకాకుళం చిన్నపిల్లల వైద్య నిపుణుల సంఘం, మా వైద్య సంఘం సంయుక్త నేతృత్వంలో జిల్లా పోలీసుల సహకారంతో ఈనెల 29న మహాసంకల్ప దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎస్.విజయ్‌కుమార్, కె.వినోద్‌కుమార్, వి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులు



రణస్థలం: మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, నాయకులు



శ్రీకాకుళంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీకాకుళం అర్బన్: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆర్థిక సంస్కరణలు ఎనలేనివని కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. - సాక్షి నెట్‌వర్క్

న్యాయవాది రామాంజనేయులు మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీనియర్ న్యాయవాది రామాంజనేయులు మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ఇతర న్యాయమూర్తులు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కోర్టు విధులను గంట పాటు వాయిదా వేశారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో రామాంజనేయులు మృతికి న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 29న నిర్వహించనున్న కోటి దీపోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నామని విజయగణపతి ఆలయ ప్రధాన అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, విజయదుర్గా ఆలయం ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ తెలిపారు. శుక్రవారం మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అష్టలక్ష్మీ పుష్పయాగ సహిత కోటి దీపోత్సవంలో భాగంగా మైదానంలో 75 ప్రస్తారాలు, అష్టలక్ష్మీల విగ్రహాలు, విజయగణపతి, విజయదుర్గా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు చెందిన పళర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మచే ప్రవచనామృతం జరుగుతుందని, అనంతరం కోటి దీపోత్సవం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమావేశం వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం జరగాల్సిన పూర్వ విద్యార్థుల సమావేశం వాయిదావేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతిచెందడంతో ప్రభుత్వం సంతాపదినాలు ప్రకటించిన నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేశామని, త్వరలో తదుపరి తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.